344)బౌళి

ప॥ వెఱ్ఱివాడ వెఱ్ఱివాడ వినియు గనియు మరి। వెఱ్ఱి దెలిసి రోకలి వేరె చుట్టే గాక॥

చ॥ పుట్టించినవాడవట పూచి నన్ను బెంచలేవా। కట్టగడ నమ్మని నాకడమే కాక।
వొట్టి నాలో నుందువట వొగి బాపము నాకేది। గట్టిగా బుణ్యము వేరే కట్టుకొనేగాక॥

చ॥ యేడనైనా నీవేయట యెదుట నుండగలేవా। వేడెవెట్టి యేడనైనా వెదకేగాక।
ఆడినదెల్లా నీవట అందులో దప్పులున్నవా। వీడుపడ్డతలపుతో వెరచేగాక॥

చ॥ భావించితే మెత్తువట పరము నీవియ్యలేవా। నీవాడననినానేరమే కాక।
శ్రీవేంకటేశుడ నేను చేరి నీకు శరణంటి। దేవుడవై కాపగా నే దిద్దుకొనేగాక॥